# జీవితరంగం



## – స్వరాజ్య పద్మజ కుందుర్తి

వందేళ్ళ క్రిందట.. ఇద్దరు అమ్మాయిలు, పదేళ్లకే వితంతువులయ్యారు, అమ్మానాన్నలు లేరు, నమ్మినవారు ఆస్తి అంతా దోచేశారు, జీవితాంతం ఎలా గడపాలి? జీవితపోరాటాన్ని కొనసాగిస్తూనే గాంధీగారి పిలుపునందుకుని స్వాతంత్ర్యోద్యమంలోకి దూకారు, ఎక్కడో బహిరంగసభలో తలిదండ్రులనుంచి తప్పిపోయి ఏడుస్తున్న పసిపాపను అక్కున చేర్చిపెంచుకున్నారు, ఒకవైపు తమదైన జీవనపోరాటం, మరోవైపు దేశంకోసం పోరాటం.. వీళ్ళు చరిత్రపుటల్లో కనిపించకపోవచ్చు, పెద్దల ఉపన్యాసాల్లో వినిపించకపోవచ్చు.. కానీవాళ్ళు ప్రదర్శించిన ఆ పోరాటపటిమ గురించి తెలుసుకుంటుంటే ఒళ్ళు గగుర్పొడుస్తుంది, నిలువెత్తు స్ఫూర్తిశిఖరాలు కళ్ళముందు కదులుతాయి. వాళ్ళపేర్లు- కనుపర్తి హనుమాయమ్మ,కొండా సత్యవతమ్మలు. అలనాటి వాస్తవ సంఘటనలను వారి మనవరాలు స్వరాజ్య పద్మజకుందుర్తిగారు నెలనెలా కథన రూపంలో మనకందిస్తున్నారు.



కనుపర్తి హనుమాయమ్మగారు



కొండా సత్యవతమ్మగారు

## ఆ అతిథి

పెద్దమ్మమ్మ చనిపోయిన కొత్తలు. నేను బహుశా ఏడవ తరగతి పరీక్షలు రాశాననుకుంటా. వేసవి శలవలు. ఇంట్లో ఎవరూ లేరు నేనూ, అమ్మమ్మే. ఉమక్క శలవలకి పెద్దక్క దగ్గరకు నిర్మల్ వెళ్ళింది. అమ్మా, చెల్లీ రెండో అక్కయ్య ఇంటికి ఏదో నోముకోసం వెళ్ళారనుకుంటా. పగలు పదిగంటలవేళ ... వాకిట్లో ఎవరో పిలుస్తున్నారు. "సత్యవతి అక్కయ్య ఉన్నారాండీ?" అంటూ.

అమ్మమ్మ మడికట్టుకుని వంటచేస్తున్నది నేను పరుగెత్తుకుని వీధివాకిలివైపు వెళ్ళాను. వాకిట్లో సన్నగా, కొంచెం పొడుగ్గా, తెల్లటి బట్టతలతో పంచె, ముతక ఖద్దరు లాల్చీ ధరించి భుజాన సంచీ తగిలించుకుని ఒక పెద్దమనిషి నిలబడి ఉన్నారు.

ఎవరా ఈ తాతగారు ఎప్పుడూ చూడలేదే! అని ఆశ్చర్యం గా చుస్తున్న నన్ను నవ్వుతూ చూసి "అక్కయ్య లేదా?" అని అడిగారు. అక్కయ్యెవరా అని నేను ఆలోచిస్తుంటే " సత్యవతమ్మగారి ఇల్లేకదా! అమ్మమ్మను పిలువమ్మా" అన్నాడు.

నేను పరిగెత్తుకుంటూ వంటింట్లోకి వెళ్ళి "అమ్మమ్మా మీ తమ్ముడట ఎవరో వచ్చారు" అన్నాను.

"తమ్ముడా? తమ్ముడెవరూ?" అంటూ అమ్మమ్మ ముందింట్లోకి వచ్చి వాకిట్లో అతన్ని చూస్తూనే ఎంతో ఆనందంగా

" రావయ్యా లోపలకు రా...బాగున్నావా కిష్టయ్యా! ఎంతకాలమైందయ్యా నిన్నుచూసి" అని పలకరించింది

ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోతూ చెక్క కుర్చీ చూపించి కూర్చోమంది. " తాతగారికి మంచినీళ్ళు తెచ్చివ్వమ్మా" అని నన్ను పురమాయించింది. కుండలోంచి పెద్దస్టీలుగ్లాసుతో ముంచి తెచ్చిన నీళ్ళను గ్లాసు పైకెత్తి గటగటా త్రాగి,

"అబ్బా! కొబ్బరినీళ్ళలా రుచిగా ఉన్నాయక్కయ్యా అని అమ్మమ్మతో అని, ఇంకోగ్లాసు పట్టుకురారా అమ్మలూ" అని నను పురమాయించి మళ్ళీ చల్లగా కడుపునిండుగా తాగి తేంచాడు ఆ తాతగారు.

"ఈ అమ్మాయెవరూ రాధ కూతురేనా?" అని ఆరాతీసి "ఇట్రా" అని పిల్చి, " నీ నెంబరెంతేవిటీ? నీపేరేంటొ చెప్పు" అన్నాడు.

నేను సిగ్గుపడుతూ " స్వరాజ్య పద్మజ" అని చెప్పాను.

ఆ పేరు వినగానే నా బుగ్గలు పుణుకుతూ " ఒహోహో! భలే పేరు పెట్టిందే మీ అమ్మమ్మనీకూ" అన్నాడు.

కాసింత గర్వంగా "ఆగష్టు పదిహేనున పుట్టాను తెలుసా?" అన్నాను.

ఇంకా సంతోషం గా " భలే భలే! భేష్" అన్నాడు.

"ఆగష్టు పదిహేను పుట్టిందని స్వరాజ్యం అని పేరుపెట్టుకుంది దీనికి అక్కయ్య. వాళ్ళ నాన్నేమో శ్రావణ మాసంలో పుట్టిందని 'పద్మజ' అని లక్ష్మీదేవి పేరు జతచేసాడు. స్వరాజ్యం అని ముద్దుగా పిలిచుకునేది దీన్ని. ఇన్నాళ్ళూ ఎన్ని ఒడిదుడుకులొచ్చినా ఒక పక్షికి రెండురెక్కల్లాగా జీవితాన్ని నడిపించాం. ఇప్పుడు ఒంటరి పక్షిని అయిపోయాను కిష్టయ్యా ..ఇంకా ఎంతకాలం ఉందో ఈ వొంటరి జీవితం" అంటూ వెక్కి వెక్కి ఏడవసాగింది.

"బాధ పడకు అక్కయ్యా. హనుమాయమ్మ అక్కయ్య పోయిందని నాకు డిల్లీలో ఉండగా తెలిసింది అందుకే రాలేక పోయాను. ఇప్పుడు పలకరించి పోదామని వచ్చాను. నువ్విలా అధైర్య పడితే ఎలా? పిల్లలు నేదరి పిల్లలు ఇంకా ..వీళ్ళ చదువు సంధ్యలూ పెళ్ళిళ్ళూ ...అబ్బో ఇంకా ఎంత బాధ్యత ఉందినీకు. భగవంతుడు వీళ్ళకి మీ రక్షణ కావాలని తోడుచేసాడు. ఎంత ధైర్యవంతురాలివి. ఇలా అధైర్య పడితే ఎలా" అని ఓదార్చాడు.

"ఇంతకీ రాధ ఏదీ...ఎక్కడా? ఎలాఉంది ఇప్పుడూ? మీ అల్లుడింకా ఆ కర్ణాటకలోనే ఉన్నాడా? ఇప్పటికీ ఇంకా పెళ్ళాం, పిల్లల ఆలనా పాలనా మీకే వదిలేసి అక్కడే ఉన్నాడా?" అని వాకబు చేసాడు.

"ఈ మధ్య అక్కయ్య పోయాక ఇంటికి ఒకసారి వచ్చాడు. అక్కడ అన్నీ వగదెంచుకుని వస్తానని వెళ్ళాడు. ఇంక ఇక్కడే ఉంటానని అంటున్నాడు. ఎంతనిజమో తెలీదు" అంది నిట్టూరుస్తూ అమ్మమ్మ.

"ఈ పూరిల్లు ఎంత చల్లగా ఉందో.... హాయిగా ఉన్నది అక్కయ్యా ఇక్కడ" అన్నాడాయన ఆవులిస్తూ.

"అయ్యో! కాసేపు నడుం వాల్చు. ఈలోగా నావంటా, నైవేద్యం అయిపోతుంది. భోజనం చేసి సాయంత్రం వెళుదువుగాని. " అంది అమ్మమ్మ.

"రేపు మీటింగు ఉందక్కయ్యా రాత్రికి గుంటూరులో రైలు ఎక్కాలె." అన్నాడాయన.

"అయితే సాయంత్రం బైలుదేరుదువులే ఎంతసేపయ్యా చిటికెలో వంటచేస్తా తినేసెయ్ ఇంతలో రాధా, నాచిన్న మనవరాలూ కూడా వచ్చేస్తారు" అని, " ఆ నులక మచం తాతయ్యకు వేసి, ఆ జంపఖానావేసి దిండు ఇవ్వు" అని నాతో చెప్పి వంటగదిలోకి వెళ్ళింది అమ్మమ్మ.

ఆయన తన దగ్గరున్న ఖద్దరు చేతిసంచీ నుండి కాయితాలేవో తీసుకుని చూసుకున్నాడు కాసేపు. మంచం పక్కనే కిందకూచుని, ఆ చేతి సంచీమీది గాంధీ తాత బొమ్మను పరీక్షగా చూస్తున్న నన్ను " ఈయన ఎవరో తెలుసా?" అని అడిగాడు.

" ఓ తెలియకేం గాంధీతాత" చెప్పాను.

" భలే " అని మెచ్చుకుని " ఈయన ఏం చేశాడో తెలుసా? " అన్నాడు.

" తెలియకపోవటమేం మనదేశానికి స్వాతంత్ర్యం తెచ్చాడు. యుద్ధం చెయ్యకుండా బ్రిటీష్ వారిని సత్యాగ్రహం అనే ఆయుధం తో తరిమి కొట్టాడు" అన్నాను.

" భలే! భేష్ ఎవరుచెప్పారు నీకు ..అమ్మమ్మచెప్పిందా?" అన్నాడు.

"అవునుతాతయ్యా అందులో అమ్మమ్మా వాళ్ళుకూడా ఉన్నారట. అమ్మమ్మ చెప్పింది" అన్నాను.

"అవునే అమ్మడూ అప్పట్లో మా అందరికీ ఈయన చెప్పిందే వేదం. దేశం లోని యువత అంతా ఆయన వెనకాలే ఆయన ఏమిచెబితే అది ఒక యుద్ధం లా చేసేవాళ్ళం. మీ పెద్దమ్మమ్మ హనుమాయమ్మ..... మహా సాహసి సుమా ఎవడినైనా ఏరా! అని పలకరించేది."

" రాట్నం వడికిన నూలు ఊరూరా తిరిగి సేకరించి సంఘానికి చేర్చేది. దారిలో పోలీసులు అడ్డగిస్తే ఏదో మాయమాటలు చెప్పి చిటికెలో తప్పించుకునేది. ఒకరోజు పుల్లరి సత్యాగ్రహం నడుస్తున్న రోజుల్లో చాలా మంది యువకులం, నాకయితే పదిహేను పదహారేళ్ళుంటాయేమో అప్పుడే కాంగ్రెసు పార్టీలో చేరాను. కన్నెగంటి హనుమంతు ఉద్యమాన్ని ప్రోత్సహిస్తూ ఆయన వెనకాల నడిచాం."

" పిడుగురాళ్ళలోనూ సత్తెనపల్లి లోనూ, ఇంకా మాచర్ల లోనూ అనేక సభలు జరిగాయి. పిడుగురాళ్ళ లో జరిగిన ర్యాలీలో అక్కయ్య నాకు పరిచయం. అప్పటికి నేను చాలా చిన్నవాణ్ణి. రూపెన గుంట్లా, దేచారం నుండి ఒక పాతిక మంది దాకా రైతులతోనూ, ఇంకా కొంతమంది కొండల్లో కోనల్లో బ్రతుకుతూ, అక్కడ కుంకుళ్ళూ ఇంకా అడవిలో దొరికే మూలికలూ సేకరించి అమ్ముకుని పొట్టగడుపుకునే కోయలతోనూ కలిసి వచ్చింది."

"తెల్లని మనిషి సన్నగా, గ్రహణమొర్రితో పైపెదవి చీలి జుట్టు పెంచుకుని క్రాపుతో తమాషాగా కనిపించింది నాకు. అమ్మో! ఆడవాళ్ళు మీకెందుకు ఈ శ్రమ" అన్నాను.

"అయ్యో అలా అంటావేంటయ్యా? నిత్యం శ్రమచేస్తేగానీ నాలుగువేళ్ళూ నోట్లోకి పోని శ్రమజీవులు వాళ్ళు."

"అడవిలో పుల్లలేరుకుని వంటచెరకుతోనే కాసింత గంజి కాచుకుంటారు. వాళ్ళుకూడా రెండురూపాయిల పన్ను కట్టాలంటే ఎలా? పాడిమీదనే మా పల్నాటి రైతులు బతుకుతారయ్యా ...బర్రెల్ని మేపుకొని ఆ పాలూ పెరుగులమీదే బతకాలి. ఇంక పంటలా ...ఆ వానదేవుడు దయచుస్తేనే ..ఒకయేడు పండితేమూడేళ్ళు పండదు. పశువులకి గ్రాసం కూడాదొరకదు."

"అడవుల్లో మేతకి జీతగాళ్ళతో తోలితేనే వాళ్ళకూ తిండి, పశువులకూ గ్రాసం దొరుకుతాయి. అంతడబ్బు రైతుల దగ్గర ఎక్కడ ఉంటుంది బాబూ. ఈ అటవీ శాఖ అధికారులు మేతకోసం వెళ్ళినవారినీ, పుల్లలకోసం, వనమూలికలకోసం వెళ్ళిన వారినీ కనీసం ఆడవాళ్ళని కూడా చూడకుండా కొట్టటం ఎంత బాధకలిగించే విషయం కదా అని...సింగమ్మా!" అని కేకేసి ఒక అమ్మాయిని చూపించింది. కుడిచేతికి భుజం వరకూ కట్టు కట్టి ఉందా అమ్మాయికి. ఎడం భుజం మీదుగా గుడ్డ కట్టి అందులో ఏడెనిమిది నెలల పిల్లవాణ్ణి కూచోబెట్టుకుని ఉంది.

ఆ పిల్లని చూపిస్తూ " చూసావా బాబూ పసివాడి తల్లి అనికూడా చూడకుండా ఎలా కొట్టారో. చెయ్యి రెండుచోట్ల విరిగింది. ఈ అవిటి పిల్ల ఇంటెడు చాకిరీ చేసి నలుగురు పిల్లల్నీ అత్తమామల్ని చూసుకోవాలి. మొగుడికి చేదోడుగాఉన్న ఈపిల్ల పొలం లో పనిచెయ్యకపోతే ఇల్లెలా గడవాలి. వీళ్ళ తరపున మాట్లాడకుండా ఉద్యమించకుండా ఎలా ఉండగలం" అన్నది.

"అయినా చిన్నపిల్లవాడివి నువ్వే సత్తెనపల్లినుంచి వచ్చావే. పల్నాటి గడ్డమీద ఉండి వాళ్ళ కష్టాలు తెలిసి సాయం రాకపోతే ఎలా" అన్నది.

"నాకు చాలా బాధేసింది. ఉద్యమంలో ఇంకా బాధ్యతాయుతం గా పోరాడాలి అనిపించింది. అప్పటినుండీ అమ్మమ్మను అక్కయ్యా అని పిలిచే వాడిని. ఎక్కడ అవసరం పడినా నిర్మొహమాటం గా వచ్చేది. చాలాధైర్యవంతురాలు" అని చెప్పాడు ఆ తాతయ్య

ఇంతలో అమ్మమ్మ వంట అయిపోయింది " క్రిష్ణయ్యా బావి దగ్గర కాళ్ళు కడుక్కు ని రా నైవేద్యం అయిపోయింది వడ్డిస్తాను," అని

"అమ్మలూ తాతయ్యకు బావి చూపించి ఒక అరిటాకు కోసుకురా" అని నాకు పురమాయించింది. ఎంచక్కా బావిదగ్గరే గుబురుగా అరటి చెట్లు ఉండేవి మాకు.

తాతయ్యకు బావి చూపించి, గాలికి చిరగకుండా ఉన్న లేత ఆకొకటి తెంపుకుని ఇంట్లోకొచ్చాను. అమ్మమ్మ కుంపట్లో వండిన దోసకాయ పప్పూ, పేరంటాలాకు కూరా, రోట్లో రుబ్బిన కందిపచ్చడీ, వేయించిన ఊర మెరపకాయలూ, మినపవడియాలూ ఆ అరిటాకులో వడ్డించింది. కమ్మని నెయ్యి ధారాళం గా వేసింది. పీటమీద కూర్చుని తింటూ "ఆహా! ఇంత కమ్మని భోజనం తిని చాలారోజులైంది అక్కయ్యా" అన్నాడు.

"ఇంకా పేరంటాలాకు సేకరిస్తున్నారా ఎక్కడ దొరుకుతోందిమీకు?" అన్నాడు ఆశ్చర్యం గా.

"మా పొలం గట్లమీద ఉంటే అక్కయ్య తప్పనిసరిగా ప్రతి యెండాకాలం కోయించి ఆరబెట్టి డబ్బాకు పెట్టేది నాయనా అదే ఇది" అన్నది అమ్మమ్మ బాధగా.

"ఆరోజుల్లో దేచిరాజు వారింట్లో ఎవరైనా చీరాల వెళుతున్నారంటే, సబ్ జైల్లో వాళ్ళకు కంది పచ్చడీ, ఇంకా చింతకాయ పచ్చడీ నూరి అరిటాకుల్లో పెట్టి కాయితాలు చుట్టి పొట్లం కట్టి ఇచ్చేవాళ్ళు జ్ఞాపకముందా మీకు" అన్నాడు ఆయన నవ్వుతూ.

" లేకేం నాయనా నువ్వూ నిత్యానందయ్యా ఇద్దరూ సిద్ధహస్తులు కదా! గోడమీదనుంచి జైల్లోకి చప్పుడు కాకుండా విసిరెయ్యటం లో ...పురుగుల అన్నం, దానికి తోడు కుళ్ళిన కూరగాయల అన్నం తినలేక పోతున్నారని మన కార్యకర్తలకు అటుకేసి నువ్వూ నిత్యానందయ్యా వెళ్ళినప్పుడల్లా పచ్చళ్ళ పొట్లాలు పట్టుకెళ్ళి నెమ్మదిగా జైలు గోడలమీదుగా మధ్యాహ్నం వేళ విసిరేసేవారు. అవి దొరికినకార్యకర్తలు జాగ్రత్తగా పంచుకొని భోజనంలో తినేవారు. ఏదో చావకుండా అంతమాత్రం ప్రాణాలు బిగపట్టుకునేవారు పాపం అన్నది అమ్మమ్మ పెరుగు వడ్డిస్తూ."

ఆ తాతయ్య భోంచేసి పడుకోగానే అమ్మమ్మా, నేనూ తినేసి వంటిల్లు సర్దేశాం. అమ్మ నోము అయిపోయి భోజనం చేసేసి ఉంటుంది పిలుచుకురమ్మని పురమాయించింది అమ్మమ్మ. ఆ యెండలో బోలెడు దూరం అక్కయ్యా వాళ్ళ ఇల్లు ...అలానే పరుగెత్తుకెళ్ళి అమ్మనూ చెల్లినీ పిలుచుకుని వచ్చాను. ఎవరో తాతగారు వచ్చారు అమ్మమ్మ పిలుస్తున్నది రమ్మని.

అమ్మ వస్తూనే ఆయనను చూసి "నమస్కారం మామయ్యగారూ" అని కాళ్ళకు దణ్ణం పెట్టింది.

ఆయన దీవించి " ఎలాఉన్నావమ్మా రాధమ్మా" అని పలకరించారు.

" ఏదో ఇలా ఉన్నాం మామయ్యగారూ" చెప్పింది అమ్మ.

"అక్కయ్య పోయిన పన్నెండోరోజునే రెండో మనుమరాలు సావిత్రికి కాలేజీలో లెక్చెరరుగా ఉద్యోగం ఖరారైనట్లు ఉత్తరం వచ్చింది. అక్కయ్య ఈ ఉద్యోగం గురించే హైదరాబాదు ఈమధ్య చాలా సార్లు తిరిగింది. మంత్రి రాజారాం గారు ఇదిగో, అదిగో అని కాలక్షేపం చేస్తుంటే ...ఒక్కసారిగా బీపీ పెరిగి ఆయనమీద కేకలేసిందట.

ఆయన దణ్ణం పెట్టి "మీరు ఇంటికి వెళ్ళండి బామ్మగారూ! ఒకవారంలో ఆఉద్యోగం మీ మనవరాలి చేతికి వచ్చినట్లే అనుకోండి" అని చెప్పి పంపారట."

"ఆపాట్న తలనొప్పితో ఇంటికొచ్చిన మనిషి మళ్ళీ లేవలేదు నాయనా! నెమ్మదిగా రెండురోజుల్లో వీలునామారాసింది. ఇప్పుడెందుకు అక్కయ్యా అంటే వినలేదు. ఆ రావుడు పిలుస్తున్నాడే ...నువ్వు రాధమ్మనీ, పిల్లలనీ జాగ్రత్తగా చూసుకో అని అప్పగించిమరీ

పోయింది. మూడురోజులు కోమాలో ఉంది. తల్లో హెమరేజ్ అని డాక్టర్లు చెప్పారు. ఆతరువాత బంధాలన్నీ తెంచుకుని నన్ను ఒంటరిచేసి పోయింది" అని అమ్మమ్మ ఏడుస్తుంటే అమ్మకూడా ఏడ్చింది. నేనూచెల్లీ ఒకరిచేయిఒకరు గట్టిగా పట్టుకుని భయం గా చూస్తూ నిలబడ్డాం .

ఆ తాతయ్యకూడా చాలా బాధపడి "జాగ్రత్త అక్కయ్యా.... జాగ్రత్త రాధమ్మ...." పెద్దవాళ్ళు మీరే ధైర్యంగా ఉండి, పిల్లలకు ధైర్యం చెప్పాలి సుమా" అని బయలుదేరాడు. " వెనకవైపుగా దారుంది నాయనా తొందరగా వెళ్ళొచ్చు" అని అమ్మమ్మ తాతయ్యను రోడ్డు మీదదాకా వదిలేసి రమ్మని చెప్పింది.

ఆ తాతయ్య చెక చెకా నడుస్తుంటే నేను పరుగెడుతూ వెళ్ళాను. రోడ్డు ఎక్కాక " కాసేపు చూద్దాం తాతయ్యా రిక్షాలు దొరుకుతాయి" అన్నాను ఆయన నవ్వి నా జడపట్టుకుని ఊపి " నేనూ మీ పెద్దమ్మమ్మ లాగే రిక్షాఎక్కను అని బస్ స్టాండ్ వైపుగా చకచెకా నడిచి వెళ్ళిపోయారు.

నేను ఇంటికి వచ్చి ఆతాతయ్య ఎవరు అమ్మమ్మా మీ తమ్ముడా అన్నాను. "ఆయన గొప్ప స్వాతంత్ర్య సమరయోధులు 'వావిలాల గోపాల కృష్ణయ్య' గారు, వారిది సత్తెనపల్లి. మాకు చిన్నతనం నుంచీ బాగా పరిచయం అందువల్ల నన్నూ అక్కయ్యనీ అభిమానంతో అక్కయ్యా... అని పిలుస్తారు. పెద్దమ్మమ్మ చనిపోయిందికదా! అందుకని పలకరించి వెళ్ళటానికి వచ్చారు." చెప్పింది అమ్మమ్మ.

ఆరోజుని ఇప్పుడు తలుచుకుంటే నాకు ఆశ్చర్యం తోనూ, ఆనందం తోనూ రోమాలు నిక్క బొడుచుకుంటాయి. అంతటి గొప్ప వ్యక్తిని దర్శించానన్న ఆనందం నేను ఎప్పటికీ మర్చిపోలేను.ఆతరువాత నేను పెద్దయ్యాక కూడా ఆయన చాలా ఉద్యమాల్లో... మొన్నమొన్నటి మద్యపాన నిషేధం దాకా ...పాల్గొని బాధ్యత గల పౌరుడిగా దేశానికి ఎన్నో సేవలందించటం చూసాను.

అమ్మమ్మా! ఆ తాతయ్య పుల్లరి సత్యాగ్రహం అని చెప్పారుగా అదేంటీ ఇంకో సత్యాగ్రహమా? దానికి పుల్లరి అని పేరెందుకు పెట్టారూ? ఇంక నా ప్రశ్నల పరంపర మొదలైంది. బైట చాలా చలిగా ఉంది. అందరం ఇంట్లోనే పడుకున్నాం. అబ్బా! మళ్ళీ మొదలెట్టావా నీ గోలా... అన్నయ్య విసుక్కున్నాడు. అయినా పట్టువదలని విక్రమార్కిణిలా అమ్మమ్మ మంచంలో దూరి దుప్పటి లాక్కుని చెప్పవా... అమ్మమ్మా ప్లీజ్ అన్నాను.

అమ్మమ్మ నవ్వి, ఒక మొట్టికాయవేసి, మొండిపిల్లా! అని ముద్దుగా తిట్టి, ఇలా చెప్పింది. " 'పుల్లరి' అన్నది ఒకపన్ను, దానిగురించి జరిగిన సత్యాగ్రహమే పుల్లరి సత్యాగ్రహం. మా పల్నాడులోనే దుర్గి కి దగ్గర్లోని మించాల పాడు అనే ఊరికి చెందిన రైతు కన్నెగంటి హనుమంతు. ఒక్కో పశువుకూ అడవుల్లో మేసినందుకు గానూ రెండు రూపాయల పన్నుకట్టాలని తెల్లదొరల ఆదేశానికి ఎదురు తిరిగాడు హనుమంతు. అతను ఆనాటి జాతీయ కాంగ్రెస్ అభిమాని.అందుకే గాంధీజీ బాటలో పుల్లరి సత్యాగ్రహం మొదలు పెట్టాడు."

" అతనికి గుంటూరు జిల్లాలోనేకాక చుట్టుపక్కల అనేక మంది రైతుల మద్దతు లభించింది. బ్రిటీషువారు కూడా భయపడిపోయారు ఆ ఉద్యమానికి. అతనికి పదవులిస్తామని, జమీన్లు ఇస్తామనీ ఎన్ని ఆశలు చూపినా అతడు ఉద్యమాన్ని వదలలేదు."

"ఇలా ఉధృతంగా ఉద్యమం నడుస్తుండగా ఉత్తర ప్రదేశ్ లో ' చౌరీ చౌరా' అనేచోట పెద్ద కొట్లాటలు జరిగాయి.అనేకమంది కాల్పుల్లో చనిపోయారు. అహింసతో కొనసాగాలన్న ఉద్యమం హింసాత్మకంగా మారటంతో, గాంధీజీ బాధపడి ఐదురోజులపాటు ఉపవాసం ఉన్నారు. ఆ తరువాత గాంధీజీ సహాయనిరాకణోద్యమాన్ని నిలిపివేయమని ఆదేశాలు ఇచ్చారు."

"అందువల్ల ఈ పుల్లరి సత్యాగ్రహం కూడా నిలిపి వేయవలసి వచ్చింది. కానీ తెల్లదొరలు జరిగిన ఉద్యమాన్ని మరచిపోలేదు. మళ్ళీ గాంధీజీ ఆదేశిస్తే ఇంకా ఎక్కువమంది ఈ ఉద్యమం లో పాల్గొంటారని భయపడ్డారు. హనుమంతుని అడ్డు తొలగిస్తే ఇంక అప్పుడు ఉద్యమం చప్పబడుతుందని ఆశించారు. ఆవూరి కరణాన్ని మచ్చిక చేసుకుని హనుమంతుని చంపెయ్యాలని పనాగంపన్నారు."

"ముందుగా హనుమంతు దగ్గరికి మనుషులను పంపించారు సంధికోసం రమ్మని, కానీ తాను ఒంటరిగా రాననీ, ప్రజలను హింసించొద్దని ప్రజలందరి పన్నూ తాను కట్టటానికి సిద్ధమనీ చెపాడు హనుమంతు."

"ఇంతలో మహాశివరాత్రి వచ్చింది. ఆవూరిలో కూడా కాంగ్రెస్ పార్టీ తరపున పెద్ద ప్రభను కట్టారు. ఆప్రభ తిరుణాలకు బైలుదేరాక కొంతదూరం వెళ్ళాక బ్రిటీషు సైన్యం పన్నుకోసం ఊరిమీద పడింది. ఆ కబురుతెలిసిన హనుమంతు ఒక్కడే వెనక్కి వచ్చాడు. ఇదే అదనుగా బ్రిటీషు సైన్యం ఊరి కరణం ద్వారా హనుమంతు అతడే అని నిర్ధారణ చేసుకుని చుట్టు ముట్టింది."

"ప్రజలను రానివ్వకుండా చుట్టుముట్టి అతనిపై కాల్పులు జరిపింది. “వందేమాతరం" అని అరుస్తూ హనుమంతు కుప్పకూలిపోయాడు. ప్రజలెవ్వరినీ సహాయం అందించటనికీ వైద్యం చేయించటానికీ అనుమతించలేదు. అర్ధరాత్రివరకూ “వందేమాతరం" అని అరుస్తూ దాదాపు ఐదారు గంటలపాటు ఆరక్తపు మడుగులోనే కొట్టుకుని మరణించేదాకా చూసి, చనిపోయాడని నిర్ధారరణ చేసుకొని, అప్పుడు కన్నీటి తుడుపుగా వైద్యం వంకతో అక్కణ్ణించి తీసుకొని వచ్చి, కనీసం శవాన్నయినా అప్పగించమని ప్రజలు వేడుకున్నా ఇవ్వకుండా తెల్లారే సరికి కోలగుంట్ల గ్రామం వరకూ తెచ్చారు."

"తిరణాలలో కన్నెగంటి హనుమంతుని చంపేశారన్న వార్త కార్చిచ్చులా వ్యాపించటంతో అనేకమంది " వందేమాతరం" అని నినాదాలు చేస్తూ, దుర్గివైపుగా తరలి వస్తున్నారని తెలిసి హనుమంతుని, అతనితో పాటే మరణించిన అతని పాలెగాడిని కోలగుంట్లలోనే పూడ్చివేసి పారిపోయారు బ్రిటీష్ సైనికులు. నాకు తెలిసి అత్యంత పాశవికంగా చంపబడ్డవాడు కన్నెగంటి హనుమంతు. శరీరం నిండా గుళ్ళతో రక్తం కారిపోతూ కూడా వందేమాతరం అని అరుస్తూనే ఉన్నాడట."

"మర్నాడు ఈవార్త వినగానే అక్కయ్య ఏడుస్తూ వెళ్ళి ఆ మహానుభావుడి సమాధి చూసి వచ్చింది. తిరణాల జనం బాగా ఎక్కువగా వచ్చారనీ లాఠీ చార్జీ జరిగిందనీ చెప్పింది. ఎంతమంది మహానుభావులు బలిదానాలు చేసారో నమ్మా! ఇది మనదగ్గర జరిగింది కనుక మనకు తెలిసింది. ఇంకా మనకు తెలియని కథలు ఎన్నో ఉన్నాయి " అమ్మమ్మ నిట్టూరుస్తూ దుప్పటి కప్పింది.

పెద్దమీసాల్తో ఠీవిగా నిలబడ్డ ఆయన నా కళ్ళముందు కదలాడాడు. రిపబ్లిక్ డే రోజుకోసం జరిగే వక్తృత్వపు పోటీల్లో ఈయనగురించే చెప్పాలి. గాంధీ ,నెహ్రూ లాంటి నాయకుల గురించి అందరూ చెబుతారు నేనుమాత్రం ఈయనగురించే చెబుతాను. ఇలాంటి వీరుల గురించికూడా మనం తెలుసుకోవాలిగా అనుకుని నిద్ర పోయాను.

*(కొనసాగింపు వచ్చే సంచికలో..!)*

Post your comments